క్లుప్తంగా

ఘనంగా ముత్యమాంబ పండగ


ముత్యమాంబ అమ్మవారు

సబ్బవరం: మండలంలోని జీవీఎంసీ పరిధి వెదుళ్లనరవ గ్రామ ప్రజల ఆరాధ్యదేవత ముత్యమాంబ అమ్మవారి పండగ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. వేకువజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ధూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కోలాటం, సాము గరిడీలు, నేల డాన్స్‌లు, బాణసంచా కాల్పులతో అమ్మవారి ఊరేగింపు అనంతరం అనుపు మహోత్సవం ఘనంగా జరిగింది. అమ్మవారిని పలువురు నేతలు, ఆలయ కమిటీ సభ్యులు దర్శించుకున్నారు.

పీహెచ్‌సీ వైద్యురాలిగా ఫాతిమా బేగం



పరవాడ: వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతన వైద్యురాలిగా అబ్దుల్ ఫాతిమా బేగం ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన వైద్యుడు క్రాంతికుమార్ విశాఖలోని కేజీహెచ్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ స్థానంలో ఫాతిమా బేగంను నియమిస్తూ వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

వ్యాయామంతో ఆరోగ్యం


విద్యార్థులతో వ్యాయామం చేయిస్తున్న త్రినాథరావు

సింహాచలం: ఆరోగ్యమే మహా భాగ్యమని, ఆరోగ్యం బాగా ఉంటేనే ఏ పనైనా సులభంగా సాధించవచ్చని ఎల్‌జీ పాలిమర్స్ విశ్రాంత ఉద్యోగి పి.త్రినాథరావు విద్యార్థులకు సూచించారు. అడవివరం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం విద్యార్థులకు వ్యాయామంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం ఆధ్వర్యంలో కొనసాగుతున్న శిబిరంలో పాల్గొన్న త్రినాథరావు విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు వివరించారు. వారిచే మాక్ డ్రిల్ చేయించారు. ప్రతి ఒక్కరూ రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, తద్వారా మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం ఏర్పడతాయని సూచించారు. కార్యక్రమంలో భాగంగా బీహెచ్‌పీవీ విశ్రాంత ఉద్యోగి, కార్మికనాయకుడు సీహెచ్ఎస్ఎన్ రాజు విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ విశేషాలను వివరించారు. విశ్రాంత హెచ్ఎం పాలేపు బంగారుచిట్టి తెలుగు వ్యాకరణాన్ని బోధించారు.

100 అడుగుల రోడ్డు విస్తరణపై పరిశీలన


డీపీఆర్‌ను పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్

సబ్బవరం: మండలంలోని లంకెలపాలెం–అనకపల్లి రోడ్డు నుంచి పైడివాడ అగ్రహారం సమీపంలోని అనకాపల్లి మండలం కోడూరు గ్రామం ఏపీఐఐసీ ఎంఎస్ఎంఈ పార్కుకు విస్తరించనున్న రోడ్డును వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో 100 అడుగుల వెడల్పున 2.68 కి.మీ. పొడవున రెండు వరుసల రహదారిగా విస్తరించనున్నట్లు తెలిపారు. రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు సాధ్యమైనంత త్వరగా టీడీఆర్ బాండ్లు జారీ చేస్తామన్నారు. రోడ్డు విస్తరణ పూర్తయితే ఈ ప్రాంతం ఇంకా అభివృద్ధి చెందుతుందన్నారు. ఇక్కడి ప్రజలు, రైతులు సహకరించాల్సిందిగా కోరారు. ఆయన వెంట సబ్బవరం తహసీల్దార్ చిన్నికృష్ణ, మండల సర్వేయర్ అప్పారావు, ఆర్ఐ వీరయ్య, ఏఆర్వో దేముడు, వీఎంఆర్‌డీఏ అధికారులు, ఎంపీటీసీ సీరం అప్పలరాజు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు


కబడ్డీ ఆడుతున్న చిన్నారులు

పెదగంట్యాడ: నీతి కథలు జీవితాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి తోడ్పడతాయని, చదువుతో పాటు క్రీడల్లో కూడా ఆసక్తి చూపాలని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారి పీవీ రమణ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో గురువారం చిన్నారులతో పుస్తక పఠనం చేయించారు. అలాగే వారికి కథలు చెప్పారు. అనంతరం వారితో కబడ్డీ ఆడించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

తాటి ముంజ.. భలే మజా..!

- వేసవితాపం.. ముంజలతో ఉపశమనం
- ఊరూ వాడా జోరుగా విక్రయాలు
- గీతకార్మికులకు స్వల్పకాలిక ఉపాధి

ప్రకృతి సిద్ధమైన నీరు.. పోషకాలు కలగలిపిన లేలేత గుజ్జు.. చిన్నా పెద్దా అందరికీ నోరూరించే వేసవి నేస్తం.. తాటి ముంజలు. భానుడు తీవ్రంగా విజృంభిస్తున్న ఈ ఏడాది కొబ్బరి, పుచ్చ, చెరకురసం, పండ్లరసాలు, ఇతర శీతల పానీయాలతో పాటు చాలా వరకు ఈ తాటి ముంజలు కూడా ప్రజలకు ఉపశమనాన్ని అందిస్తున్నాయి. గతంలో పూర్తిగా పల్లెలకు మాత్రమే పరిమితమైన తాటి ముంజలు, ప్రస్తుతం నగరంలోనూ విరివిగా లభిస్తున్నాయి. ఇతర జిల్లాల నుంచి వలస వచ్చిన వందలాది మంది గీత కార్మికులు వీటిని గ్రామాల్లో సేకరించి నగరంలో అమ్మకాలు సాగిస్తూ ఉపాధి పొందుతున్నారు.




పెందుర్తిలో రోడ్డు పక్కన తాటి ముంజలు తీస్తున్న గీత కార్మికులు



పెందుర్తి: వేసవిలో ప్రతి ఒక్కరూ కనీసం రెండు మూడు సార్లయినా తినక తప్పనివి తాటి ముంజలు. గ్రామాల్లో లభించే ఈ సహజసిద్ధమైన పోషకాలతో కూడిన తాటి ముంజలకు వేసవిలో ఎంతో క్రేజ్. ఏటా వేసవిలో మాత్రమే దొరికే ప్రకృతి సిద్ధమైన ఓ పండు జాతికి చెందినది ఇది. పట్టణాల్లో ఐస్ యాపిల్‌గా దీనిపై పిల్లలకు మరింత మోజు. వీటిని పల్లెల నుంచి నగరవాసులకు చేరుతున్న క్రమంలో గీత కార్మికుల కష్టం చాలానే ఉంది. పల్లెల్లో పొలాల గట్లపై తాటిచెట్ల నుంచి వీటిని సేకరిస్తారు. రియల్ భూమ్‌లో తాటి చెట్లన్నీ కనుమరుగవుతుండటంతో వీరి బుట్ట నింపుకోవడానికి వేకువజాము నుంచి పొద్దెక్కే వరకు తీవ్రంగా కష్టపడాల్సిందే..!

స్వల్పకాలిక ఉపాధి బాట

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ **జిల్లాల నుంచి** ఏటా వేసవిలో వందలాది మంది **గీత కార్మికులు** పెందుర్తి ప్రాంతానికి వలస వస్తా**రు. ఈ ఏడాది** ఏప్రిల్‌లోనే కొన్ని కుటుంబాలు ఇక్క**డకు చేరుకు**న్నాయి. వీరు వేకువ జాము 5 గంటలకు తాటి **చెట్ల వద్దకు చేరుకుని తాటి గెలల్ని దించుతారు. కొందరు అక్కడే ముంజలు ఒలిచి, బుట్టల్లో సర్దుకుంటారు. ఆర్టీసీ బస్సులు, ఆటోల్లో నగరానికి చేరుకుంటారు. మరి కొందరు మాత్రం ఏకంగా తాటి గెలల్ని ఆటోలు, మినీ వ్యాన్లలో రోడ్డు పక్కన పెట్టుకుని విక్రయిస్తుంటారు. డజను ముంజలు పరిమాణాన్ని బట్టి రూ.40 నుంచి రూ.60 వరకు విక్రయిస్తున్నారు. రోజుకు రూ.వెయ్యి నుంచి రూ.2 వేలు వరకు గిట్టుబాటవుతుందని వీరు చెబుతున్నారు.**

ముంజలు చేసే మేళ్లు అన్నీ ఇన్నీ కావు..

- తాటి ముంజల్లో విటమిన్ బి, సి, ఐరన్, కాల్షియం, జింక్, పొటాషియం లాంటి పోషక విలువలతోపాటు, యాంటీ క్యాన్సర్, యాంటీ డయాబెటిక్ లక్షణాలు కూడా ఉన్నాయి.
- అప్పుడే తీసిన ముంజను నేరుగా తింటే జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుంది. నీటిశాతం అధికంగా ఉండటం వలన ఇవి తిన్న వెంటనే శరీరం చల్లబడి, డీహైడ్రేషన్ నుంచి తక్షణ ఉపశమనం పొందవచ్చు.
- క్యాలరీలు తక్కువగా, ఫైబర్ ఎక్కువగా ఉండడం వల్ల బరువు తగ్గడంతోపాటు, మలబద్ధకాన్ని నివారిస్తుంది. షుగర్ రోగులకు చాలా మేలు చేస్తుంది.
- ముంజల్లోని యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచి, చర్మ సమస్యలను దూరం చేస్తాయి.
- ఇందులోని పొటాషియం లివర్ సంబంధిత రుగ్మతలను తగ్గిస్తుంది.
- వివిధ రకాల ట్యూమర్స్, బ్రెస్ట్ క్యాన్సర్ కణాలను అభివృద్ధి చేసే ఫైటోకెమికల్స్, ఆంథోసయనిన్ లాంటి వాటిని తాటి ముంజలు నిర్మూలిస్తాయని పరిశోధనల్లో తేలింది.
- వడదెబ్బ బారిన పడిన వారికి నిమ్మరసంతో ఎలాంటి ఫలితం లేకపోతే తాటి ముంజలు తినిపించడం చాలా మంచిది.

వీరు తినకపోవడమే మంచిది..



- డయాబెటిస్‌తో బాధపడేవారు తాటి ముంజల్ని మితంగా తినాలి. వీటిలో సహజ చక్కెర ఎక్కువగా ఉంటుంది. వీటిని ఎక్కువగా తినడం వల్ల రక్తంలో షుగర్ లెవల్స్ అదుపు తప్పే ప్రమాదం ఉంది.
- కడుపు ఉబ్బరం, గ్యాస్, కడుపు నొప్పి, అజీర్తి వంటి సమస్యలతో బాధపడుతున్న వారు వీటికి దూరంగా ఉండటమే మేలు. లేత ముంజలు తినడం వల్ల అంతగా ఇబ్బంది ఉండకపోవచ్చు. కానీ ముదురు ముంజలతో వీరికి ప్రమాదం.
- గర్భిణులు, బాలింతలు తాటి ముంజలు తినే విషయంలో జాగ్రత్తగా ఉండాలి. వీటిలో ఉండే ఇథనాల్ లిపిడ్ గర్భిణులకు అంత మంచిది కాదు. పాలిచ్చే తల్లులు వీటిని తినడం వల్ల శిశువులకు కడుపు నొప్పి వచ్చే ప్రమాదముంది. డాక్టర్ సలహాతో వీటిని తీసుకోవచ్చు.
- ఫ్యాటీ లివర్, కాలేయ సమస్యలతో బాధపడే వారు కూడా తాటి ముంజలకు దూరంగా ఉండటమే మేలు. తాటి ముంజల్లో ఉండే ఇథనాల్ లిపిడ్ వీరి జీవక్రియకు అంతరాయం కలిగిస్తుంది. కాలేయంలో కొవ్వు మరింతగా పేరుకుపోవడానికి దారితీస్తుంది.

చాలా సమస్యల్ని దూరం చేస్తాయి



చాలా అనారోగ్య సమస్యలను తాటి ముంజలు దూరం చేస్తాయి. చాలామంది తాటి ముంజల పై ఉండే పొట్టు/తొక్కను ఒలిచి తింటారు. అందులో కూడా ఎన్నో పోషకాలు ఉన్నాయి. అవి ఆరోగ్యానికి ఎంతో మంచి చేస్తాయి. **ముంజలు** ఎండాకాలంలో కొంత మందికి **ముఖంపై వచ్చే** కొన్ని రకాల మొటిమలను **అడ్డుకుంటాయి.** శరీరానికి కావాల్సిన **మినరల్స్,** చక్కెర పదార్థాలను **సమతుల్యం చేస్తా**యి.

– డా ఎంవీఈ రామానాయుడు, ఎం.డి., జనరల్ ఫిజీషియన్

తాజా ముంజల్నే తినాలి



వేసవిలో తాటి ముంజల్ని తినేందుకు అందరూ ఇష్టపడతారు. అయితే తాటి ముంజల్ని తాజాగా ఉన్నప్పుడే తినాలి. ఫ్రిజ్‌లో స్టోర్ చేసి తింటే వాటిలోని పోషకాలు చాలా వరకు నశించిపోతాయి. కొన్నిసార్లు అలాంటివి తినడం ద్వారా ఆరోగ్యానికి ముప్పు కూడా వాటిల్లవచ్చు. ఏదైనా మితంగా తింటేనే ఆరోగ్యం. వీటిని కూడా తక్కువ మోతాదులో తినాలి. వ్యాధులతో బాధపడుతూ మందులు వేసుకునేవారు వైద్యుడి సలహాతోనే వీటిని తినాలి. లేకుంటే మనం వేసుకునే మందులతో రియాక్షన్ జరిపే ప్రమాదం ఉంది.

– డా.ఎస్.దివ్యభారతి, ఎం.డి.(ఆయుర్వేదం), న్యూట్రిషనిస్ట్

వైభవంగా బంగారమ్మతల్లి పండగ


ఘటాల ఊరేగింపులో భక్తులు

పెందుర్తి: మండలంలోని గొరపల్లి పంచాయతీ గంగమ్మపేటలో వెలసిన బంగారమ్మతల్లి పండగ గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసి, పసుపు–కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అనుపోత్సవం వైభవంగా జరిగింది. జానపద నృత్యాలు, బాణాసంచా వెలుగుల నడుమ ఘటాల ఊరేగింపు ఘనంగా సాగింది. యువకులు పగటి వేషాలతో సందడి చేశారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గొరపల్లి, గంగమ్మపేట, కోట్నీవానిపాలెం, కరకవానిపాలెం, గొల్లలపాలెం, గవరపాలెం ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు.


పూజలందుకున్న బంగారమ్మతల్లి


అనుపు మహోత్సవంలో నేల వేషధారుల విన్యాసాలు

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

- ఘనంగా స్వర్ణపుష్పార్చన
- వైభవంగా నిత్యకల్యాణం


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేసి, 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం శేషవస్త్రాలను అందించారు.

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాల తో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామి వారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

వైద్యాధికారి అందుబాటులో లేకపోతే ఎలా?

ఆగ్రహం వ్యక్తం చేసిన డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు


రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

పెందుర్తి: చినముషిడివాడ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు గురువారం సందర్శించారు. ఆ సమయానికి వైద్యాధికారి అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అభ ఐడీ రిజిస్ట్రేషన్ తక్కువగా ఉండటంపై ప్రశ్నించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, అభ ఐడీ రిజిస్ట్రేషన్, ముఖ హాజరు వేయాలని ఆదేశించారు. సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పురుషోత్తపురంలోని పట్టణ ఆరోగ్య కేంద్రంను సందర్శించిన ఆయన అక్కడ వైద్యాధికారి అందుబాటులో ఉండి, సమయానికి అందిస్తున్న సేవలను చూసి అభినందించారు. ఎన్‌సీడీ 3.0, అభ ఐడీ రిజిస్ట్రేషన్ క్షేత్రస్థాయిలో సందర్శించి ఆరోగ్య సిబ్బందికి అవగాహన కలిగించారు. ముఖ్యంగా ఓపీ, ఐపీ, ల్యాబ్‌టెస్ట్స్, సాధారణ ప్రసవాల గురించి పలు సూచనలు చేశారు. వైద్యాధికారులు, సిబ్బంది ముఖ హాజరు తప్పనిసరిగా వేయాలన్నారు. ఆశా కార్యకర్తలు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. గర్భిణులకు టీటీ వ్యాక్సిన్, ఐరన్ ఫోలిక్ మాత్రలు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. అనీమియా బారిన పడకుండా చూడాలని అప్రమత్తం చేశారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


దాతకు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి విజయవాడకు చెందిన బలుసు తనుశ్రీ రూ.లక్ష 11 రూపాయల విరాళాన్ని గురువారం అందించారు. సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలోని డొనేషన్ కౌంటరులో అందజేశారు. దేవస్థానం తరపున దాతకు బాండ్‌ను సూపరింటిండెంట్ విక్రమ్ అందించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామి వారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాన్ని అందజేశారు.

ఉల్లాసంగా వేసవి విజ్ఞాన శిబిరం


బాల్ ఇన్ ద బాస్కెట్ ఆట ఆడుతున్న విద్యార్థులు

పెందుర్తి: స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణ శిబిరం ఉల్లాసంగా ఉత్సాహంగా సాగింది. విద్యార్థులకు కథలు చదవడం, రాయడాన్ని నేర్పించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు ఆర్.జానకిరామ్ విద్యార్థులతో బాల్ ఇన్ ద బాస్కెట్ ఆట ఆడించారు. సూక్తులు, మంచి మాటలు చెప్పించారు. ఇంగ్లిష్ గ్రామర్‌లో మెలకువలను రిటైర్డ్ ఇంగ్లిష్ టీచర్ ఇ.వెంకటేశ్వరరావు నేర్పించారు. విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చిన ఆరు మాసాలకే..


ఊటగెడ్డ మలుపులో ప్రమాదకరమైన గొయ్యి


ఇటుకల పరిశ్రమ వద్ద ఛిద్రమైన రోడ్డు

పరవాడ: వాడచీపురుపల్లి–పరవాడ రహదారిలో పలు చోట్ల ఏర్పడిన గుంతలు ప్రయాణికుల పాలిట శాపాలుగా మారుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్లు భవనాల శాఖ అధికారులు గుంతలను తూతూమంత్రంగా పూడ్చి, చేతులు దులిపేసుకున్నారు. దీంతో 6 నెలలు తిరక్కముందే రోడ్డులో మళ్లీ యథావిధిగా భారీ గుంతలు దర్శనమిచ్చాయి. ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రహదారిలో ఎన్టీపీసీ 4వ యూనిట్ వద్ద రోడ్డు మధ్యలో పడిన గుంతలు రాత్రి వేళ, చెట్ల నీడన కనిపించకపోవడంతో వాహనాలు గుంతల్లో పడి ప్రయాణికులు పల్టీలు కొడుతున్నారు. బొగ్గు, బూడిద లారీల రాకపోకలతో పాత ఇటుకల పరిశ్రమ వద్ద రోడ్డు ధ్వంసమై, పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. ఊటగెడ్డ కూడలి వద్ద పలు చోట్ల ఏర్పడిన గుంతలు ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు పెడుతున్నాయి. ప్రయాణికుల అవస్థలను గుర్తించి, త్వరితగతిన రోడ్డు మరమ్మతులకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఫార్మాసిటీలో 'కస్టమ్స్' అదనపు కార్యాలయం


మాట్లాడుతున్న వీఎస్ఈజెడ్ జాయింట్ కమిషనర్ రోషిణి అపరంజి కొరాటి

పరవాడ: కస్టమ్స్ కార్యాలయానికి వచ్చే ప్రొబేషనర్లకు శిక్షణ ఇచ్చేందుకు కస్టమ్స్ నూతన అదనపు కార్యాలయం ఎంతగానో ఉపయోగపడుతుందని వీఎస్ఈజెడ్ జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోషిణి అపరంజి కొరాటి అన్నారు. విశాఖ ఫార్మాసిటీ ఎస్ఈజెడ్‌లో ఏర్పాటు చేసిన కస్టమ్స్ అదనపు భవనాన్ని ఆమె గురువారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో సకల మౌలిక సదుపాయాలతో కూడిన భవన సముదాయాన్ని సమకూర్చిన విశాఖ ఫార్మాసిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ అదనపు కార్యాలయంతో పరిశ్రమల యాజమాన్యాలకు వేగవంతమైన సేవలు అందించేందుకు వీలవుతుందన్నారు. కార్యక్రమంలో కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ ఎస్‌జేఎస్‌హెచ్‌కే వరప్రసాదవర్మ, డిప్యూటీ డెవలప్‌మెంట్ కమిషనర్ శివప్రసాదరెడ్డి, అసిస్టెంట్ డెవలప్‌మెంట్(లేబర్) కమిషనర్ రమ్య మెట్ట, ఫార్మాసిటీ డీజీఎం హెచ్ఆర్ గిరిధర్‌రావుభక్షి, సత్యంనాయుడు, ఎస్ఈజెడ్ పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పలరాజు ఆశయసాధనకు కృషి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

పెందుర్తి: కష్ట జీవుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసిన గుండాల అప్పలరాజు ఆశయసాధన కోసం ముందుకు సాగాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ నెల 6న గుండెపోటుతో మరణించిన అప్పలరాజు సంస్మరణ సభ పెందుర్తి కార్మికనగర్‌లో జోన్ కార్యదర్శి బి.జగన్ అధ్యక్షతన గురువారం జరిగింది. కార్యక్రమంలో వి.శ్రీనివాసరావు పాల్గొని, అప్పలరాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, కార్పొరేటర్ బి.గంగారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, పి.మణి, బి.పద్మ, మణి, ప్రభావతి, వి.కృష్ణారావు, బి.రమణి తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి


ముఠా కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న ఉప్పాడ సత్యవతి

సబ్బవరం: దేశవ్యాప్త కార్మిక సమ్మె విజయవంతానికి ప్రతి ఒక్కరూ కలిసి రావాలని సిటు మండల ప్రతినిధి ఉప్పాడ సత్యవతి పిలుపునిచ్చారు. మండల కేంద్రం సబ్బవరంలో ముఠా కార్మికులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్మిక హక్కుల సాధనలో భాగంగా కార్మిక చట్టాలను అమలు చేయాలని, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నశించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో మాఠా కార్మికులంతా పాల్గొనాలని కోరుతూ, కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో డి.నూకరాజు, బర్ల రమణ తదితరులు పాల్గొన్నారు.